సాక్షి
వనపర్తి

శుక్రవారం । 18 । ఆగస్టు । 2023



హాకీ ఎంపికలు ప్రారంభం

వనపర్తి హాకీ అకాడమీలో ఖాళీగా ఉన్న 13 సీట్లకు గురువారం ఎంపికలు నిర్వహించారు.

వివరాలు 8లో ▸



శాంతిభద్రతల పరిరక్షణ

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ కోరారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.5 /24.3

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మద్యం దుకాణాలకు రికార్డుస్థాయి దరఖాస్తులు



వనపర్తి: జిల్లాలోని మద్యం దుకాణాలకు గురువారం రికార్డుస్థాయిలో దరఖాస్తులు వచ్చాయి. జిల్లావ్యాప్తంగా 37 దుకాణాలుండగా.. ఒక్కరోజే 266 టెండర్ ఫారాలు దాఖలైనట్లు ఈఎస్ ప్రభు వినయ్‌కుమార్ తెలిపారు. కాగా.. ఇప్పటి వరకు జిల్లాలోని మూడు ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో 540 దరఖాస్తులు వచ్చాయని.. శుక్రవారం చివరిరోజు మరిన్ని ఎక్కువ వచ్చే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు వేస్తున్నారు.

ఔషధాలతో కుష్టు నివారణ



పాన్‌గల్: కుష్టు వ్యాధిగ్రస్తులు ఎండీటీ (బహుళ ఔషధ) చికిత్స ద్వారా క్రమం తప్పకుండా 6 నెలల నుంచి ఏడాది పాటు మందులు వాడితే నయమవుతుందని డీఎంహెచ్‌ఓ డా. రవిశంకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించి పకడ్బందీగా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కుష్టు మచ్చలు సహజ చర్మం కంటే తక్కువ లేదా ఎరుపు లేదా రాగి రంగు కలిగి ఉంటాయన్నారు. మచ్చలపై స్పర్శ ఉండదని.. శరీరంలో ఏ భాగంలోనైనా రావచ్చని వివరించారు. వ్యాధి లక్షణాలు బహిర్గతం కావడానికి మూడేళ్ల సమయం పడుతుందని.. వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించి మందులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ పారా మెడికల్ అధికారి నందీశ్వర్, వైద్యసిబ్బంది సతీష్, రాంచందర్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో వసతుల కల్పన..

పాన్‌గల్: పీహెచ్‌సీల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు జాతీయ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ కమిటీ సభ్యుడు డా. శ్రీరామ సీజీ, డా. శిరీష్‌కుమార్ నస్కార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని వారు సందర్శించి వసతులపై ఆరా తీశారు. ఇంకా కల్పించాల్సిన వసతులపై సమావేశంలో చర్చించారు. సౌకర్యాలు మెరుగుపర్చడంతో రోగులకు నాణ్యమైన వైద్యం అందుతుందని డీఎంహెచ్‌ఓ డా. రవిశంకర్ అన్నారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా వైద్యసేవలు అందించాలని వైద్యసిబ్బందికి సభ్యులు సూచించారు. సమావేశంలో వైద్యులు రాకేష్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, హరీశ్, లావణ్య, లత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

వనపర్తిటౌన్: జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులకు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత/జెడ్పీ/ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డీఈఓ గోవిందరాజులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానోపాధ్యాయులు 15 ఏళ్లు, ఉపాధ్యాయులు 10 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల ఉపాధ్యాయులు 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు ప్రతి మండలం నుంచి ముగ్గురు ఉపాధ్యాయులను ఎంపికచేసి పైన తెలిపిన తేదీలోగా తెలియజేయాలన్నారు.

వైద్య ఖాళీల భర్తీకి..

వనపర్తిటౌన్: ఆయుర్వేదిక్, హోమియోపతి మెడికల్ ఆఫీసర్, స్వీపర్ నర్సింగ్ ఆర్డర్లీ ఒక్కొక్కటి చొప్పున ఖాళీలున్నాయని.. అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. రవిశంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ ఆఫీసర్ పోస్టుకు బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్, బోర్డు ఆఫ్ ఇండియన్ మెడిసిన్‌లో రిజిస్టర్ చేసుకున్న అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. పోస్టులను జాతీయ ఆరోగ్య మిషన్ కింద భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. మెడికల్ ఆఫీసర్ పోస్టుకు రూ.500, స్వీపర్ నర్సింగ్ ఆర్డర్లీ పోస్టుకు రూ.300 డీడీసీని ఈ నెల 22వ తేదీలోగా పూర్తి వివరాలు, జిరాక్స్ ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు www.wanaparthy.telangana.gov.in వెబ్‌సైట్, సెల్‌ఫోన్ నంబర్ 80198 21198 సంప్రదించాలని పేర్కొన్నారు.

చేనేత.. చేయూత

- జాతీయ చేనేత దినోత్సవం రోజున ప్రకటించిన మంత్రి కేటీఆర్
- జిల్లాలో 369 మంది కార్మికులకు లబ్ధి

జియోట్యాగింగ్ ఉన్న మగ్గాలకు ప్రతి నెల రూ.3 వేలు

అమరచింత: చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న చేనేతమిత్ర పథకం ద్వారా **జియోట్యాగింగ్** ఉన్న ప్రతి మగ్గానికి నెలకు **రూ.మూడు వేలు** ప్రభుత్వం చెల్లించనుంది. జాతీయ చేనేత దినోత్సవం రోజున హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ స్వయంగా ప్రకటించడంతో చేనేత కార్మికుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. జిల్లావ్యాప్తంగా చేనేత కార్మికులు మగ్గాలున్న గ్రామాలు, పట్టణాల్లో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యేల చిత్రపటాలకు పాలభిషేకాలు నిర్వహించి సంబురాలు జరుపుకొన్నారు. మంత్రి ప్రకటనతో జిల్లాలోని 369 మగ్గాల యజమానులు లబ్ధిపొందే అవకాశం ఉంది. గతంలో జియో ట్యాగింగ్ కలిగిన చేనేత కార్మికుడు తన మగ్గానికి అవసరమయ్యే నూలు, రేషం కొనుగోలుపై చేనేతమిత్ర పథకంలో భాగంగా ప్రభుత్వం రాయితీ ఇచ్చేది. ప్రతి చీరకు రూ.600 నుంచి రూ.రెండు వేల వరకు చెల్లించేది. వీటిని పొందేందుకు కార్మికుడు కొనుగోలు చేసిన బిల్లులను జౌళిశాఖ కార్యాలయంలో అందించాల్సి ఉండగా.. రాయితీ డబ్బుల కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉండేది. ఇక మంత్రి ప్రకటనతో నేరుగా నేతన్న బ్యాంకు ఖాతాలోనే ప్రతి నెల రూ.మూడు వేల నగదు జమ చేయనున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలోని అమరచింత, తిప్పడంపల్లి, ఘనపురం, కొత్తకోట, వెల్టూర్, తూంకుంటలో చేనేత, ఉన్ని కార్మికులు మగ్గాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రతినెల రెండు, మూడు చీరలు తయారు చేసి వచ్చే వేతనంతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. జిల్లా మొత్తంలో అమరచింతలోనే 219 మగ్గాలు జియోట్యాగింగ్ కలిగి ఉన్నాయి. ఒక్కో మగ్గానికి ముగ్గురు చేనేత కార్మికులు శ్రమించాల్సి ఉంది. అదేవిధంగా ఆత్మకూర్ మండలం వెల్టూర్‌లో 99, కొత్తకోటలో 32, ఘనపురంలో 8, తిప్పడంపల్లిలో 6, తూంకుంటలో 5 మగ్గాలు ఉన్నాయని జిల్లా జౌళిశాఖ అధికారులు వెల్లడించారు.

'చేనేతమిత్ర' మరింత సులభం..

చేనేతమిత్రతో నూలు కొనుగోలు చేసిన కార్మికులకు ప్రభుత్వం రాయితీ అందించేది. వీటిని పొందాలంటే చేనేత పారిశ్రామిక సంఘాల సభ్యులతో పాటు జౌళిశాఖ కార్యాలయానికి పనుల కోసం వెళ్లేవారిని ఆశ్రయించాల్సిన అవసరం ఉండేది. కార్మికులు పడుతున్న ఇబ్బందులు గుర్తించిన మంత్రి కేటీఆర్ ఇకపై నేరుగా కార్మికుల ఖాతాలోనే నెలకు రూ.3 వేలు జమ చేస్తామని ప్రకటించడంతో చేనేతమిత్ర మరింత సులభతరంగా మారింది. ఇకనుంచి నేరుగా బ్యాంకు ఖాతాలో నగదు జమకానుండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



అమరచింతలో మగ్గంపై జరిచీర నేస్తున్న కార్మికులు (ఫైల్)



సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే చిట్టెం చిత్రపటాలకు పాలభిషేకం చేస్తున్న చేనేత కార్మికులు (ఫైల్)

మార్గదర్శకాలు రాలేదు..



జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో మంత్రి కేటీఆర్ జియోట్యాగింగ్ ఉన్న ప్రతి మగ్గానికి రూ.మూడు వేలు ఇస్తామని ప్రకటించారు. వీటికి సంబంధించిన మార్గదర్శకాలు రాలేదు. వచ్చిన వెంటనే పూర్తిస్థాయిలో సర్వేచేసి ప్రతి కార్మికుడు లబ్ధిపొందేలా నివేదికలు సిద్ధం చేస్తాం.

– గోవిందయ్య, ఏడీఏ, చేనేత, జౌళిశాఖ

సంతోషంగా ఉంది...



ప్రభుత్వం వచ్చే నెల నుంచి ప్రతి మగ్గానికి రూ.మూడు వేలు చెల్లిస్తామని ప్రకటించడం సంతోషంగా ఉంది. గతంలో రేషం రాయితీ కోసం ప్రతినెల ఇబ్బంది పడేవాళ్లం. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసేవాళ్లం. ఇకనుంచి నేరుగా బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేస్తామనడం ఆనందం కలిగించింది.

– మహంకాళి లచ్చి,
చేనేత కార్మికుడు, అమరచింత

ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూర్చాలి..



ప్రభుత్వం జియోట్యాగింగ్ ఉన్న ప్రతి నేత కార్మికుడికి చేనేతమిత్ర వర్తింపజేయాలి. ప్రతి మగ్గంపై ముగ్గురు కార్మికులు ఆధారపడి జీవిస్తుంటారు. ప్రతి ఒక్కరూ లబ్ధిపొందేలా చర్యలు తీసుకోవాలి. సంక్షేమ పథకాలతో కార్మికులకు భరోసానివ్వాలి. నిరుపేద కార్మికులను ఆదుకోవాలి.

– తిరుమల మోహన్,
చేనేత కార్మికుడు, అమరచింత

'హరితహారం'పై దృష్టి



జానంపేట గ్రామపంచాయతీలో రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ తిరుపతిరావు


పెబ్బేరు రూరల్: హరితహారం, పారిశుద్ధ్యంపై అధికారులు దృష్టిసారించాలని అదనపు కలెక్టర్ ఎస్.తిరుపతిరావు అన్నారు. గురువారం ఆయన డీపీఓ సురేష్‌కుమార్‌తో కలిసి శ్రీరంగాపురం మండలం వెంకటాపురం, జానంపేట, నాగరాల, కంభాళాపురం గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్యం, హరితహారంలో నాటిన మొక్కలు, అవెన్యూ ప్లాంటేషన్, సెగ్రిగేషన్‌షెడ్, వాటర్ ట్యాంకులు పరిశీలించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పనితీరు, ప్రదర్శన సూచిక, గ్రామపంచాయతీల రికార్డులను తనిఖీ చేశారు. అలాగే వెంకటాపురం గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పనితీరు ఆధారంగా క్రమబద్ధీకరిస్తామని చెప్పారు. ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఎంపీఓ రాజు, సర్పంచ్ నాగన్న, హెచ్ఎం వరలక్ష్మి, ఏపీఓ గట్టయ్య, పంచాయతీ లక్ష్మి, కార్తీక్, జహంగీర్, మణి పాల్గొన్నారు.

➪ పెబ్బేరు మండలంలోని కొత్తసూగూర్, బున్యాదిపూర్‌లో గురువారం అదనపు కలెక్టర్ తిరుపతిరావు, జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌కుమార్ పర్యటించారు. ఆయా గ్రామపంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, హరితహారం మొక్కలు, ఉపాధిహామీ పనుల రికార్డులను పరిశీలించారు. వారి వెంట ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంపీఓ రోజారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు యాదగిరి, రాజేశ్వర్, సర్పంచ్‌లు జూదం వెంకటేష్, వనం గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

● ఐదుగురు.. ముగ్గురు.. ఇద్దరు

మక్తల్.. దంగల్!

- కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలో టికెట్ల లొల్లి
- 'హస్తం'లో తీవ్రస్థాయికి అంతర్గత కుమ్ములాటలు
- ఆసక్తికరంగా మాజీ ఎమ్మెల్యే సీతమ్మ అడుగులు
- నియోజకవర్గంపై 'కమలం' ప్రత్యేక నజర్



అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న కొద్దీ రాజకీయం వేడెక్కుతోంది. రోజురోజుకూ సమీకరణలు వేగంగా మారుతుండగా.. ఎమ్మెల్యే సీటు కోసం ఆశావహుల మధ్య పోటాపోటీ నెలకొంది. ప్రధానంగా తెలంగాణ–కర్ణాటక సరిహద్దులో ఉన్న మక్తల్ నియోజకవర్గానికి సంబంధించి బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలో అంతర్గత కుమ్ములాటలు ఆయా పార్టీ అధిష్టానాలను కలవరపెడుతున్నాయి. ఇక్కడ అన్ని పార్టీల్లోనూ గ్రూప్ రాజకీయాలే కొనసాగుతుండగా.. 'హస్తం'లో ఈ పరిస్థితి మరింత ఎక్కువగా ఉంది. టికెట్ కోసం ఐదుగురు నేతలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. మరో మహిళా నేత, మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి సైతం పావులు కదుపుతున్నట్లు ప్రచారం జరుగుతుండడంతో కాంగ్రెస్‌లో టికెట్ల కుంపటి హాట్‌టాపిక్‌గా మారింది.

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

ప్రజాక్షేత్రంలోనే చిట్టెం..

మక్తల్ బీఆర్ఎస్‌లో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డితో పాటు వీజీఆర్ ఫౌండేషన్ చైర్మన్ వర్కటం జగన్నాథరెడ్డి, రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, తెలంగాణ ఉద్యమకారుడు దేవర మల్లప్ప టికెట్ ఆశిస్తున్నారు. అయితే సిట్టింగ్‌లకే టికెట్లు అని సీఎం కేసీఆర్ ప్రకటించిన నేపథ్యంలో మళ్లీ రామ్మోహన్‌రెడ్డినే బరిలో ఉండే అవకాశాలు మెండుగా ఉన్నాయి. నిత్యం ప్రజాక్షేత్రంలోనే ఉంటున్న ఆయన తనకు పార్టీలో ఎవరితోనూ పోరు లేదని.. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీ ప్రత్యేక దృష్టి..

మరోవైపు మక్తల్ నియోజకవర్గంలో బీజేపీ కూడా బలంగా ఉంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి డీకే అరుణకు బీఆర్ఎస్ అభ్యర్థి కంటే అధికంగానే ఓట్లు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈ సెగ్మెంట్‌పై బీజేపీ అధిష్టానం ప్రధానంగా నజర్ వేసింది. ఈ నియోజకవర్గంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జలంధర్‌రెడ్డి, కొండయ్య మధ్య టికెట్ కోసం పోటీ నెలకొంది. అధిష్టాన నిర్ణయమే తమకు ఫైనల్ అని చెబుతున్న వారు.. తమకే టికెట్ వస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

సీతమ్మ పయనం ఎటువైపో..



2018 ఎన్నికల్లో మక్తల్ నుంచి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన కొత్తకోట సీతమ్మ భర్త దయాకర్‌రెడ్డి మూడోస్థానంలో నిలిచారు. అంతకుముందు 2009 ఎన్నికల్లో ఆయన టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. సీతమ్మ సైతం దేవరకద్ర నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇటీవల దయాకర్‌రెడ్డి మృతి చెందగా.. గతంలో వీరిరువురు ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించారు. ప్రస్తుత రాజకీయ పరిణామాల క్రమంలో సీతమ్మ దారి ఎటువైపోననే చర్చ జోరుగా సాగుతోంది. బీఆర్ఎస్ నుంచి సీటు రాకుంటే కాంగ్రెస్‌లో చేరుతారని.. సీతమ్మకే పార్టీ టికెట్ వస్తుందని ఆమె వర్గీయులు చెబుతుండడం హాట్‌టాపిక్‌గా మారింది.

జోడో యాత్ర జోష్‌తో..

మక్తల్ నియోజకవర్గంలో ప్రతిసారి ఓటర్ల తీర్పు భిన్నంగా ఉంటోంది. మొదటి నుంచీ ఈ సెగ్మెంట్ కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉంది. ఇప్పటివరకు ఇక్కడ 16 పర్యాయాలు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ 12, టీడీపీ మూడు, బీఆర్ఎస్ ఓ సారి విజయం సాధించాయి. తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014లో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన చిట్టెం రామ్మోహన్‌రెడ్డి.. మారిన రాజకీయ పరిణామాల క్రమంలో భారత రాష్ట్ర సమితి (అప్పటి టీఆర్ఎస్)లో చేరారు. 2018 ఎన్నికల్లో ఆయన బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి రెండోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆయన కాంగ్రెస్ వీడిన తర్వాత ఆ పార్టీలో సరైన నాయకత్వమే కరువైంది. ఈ నియోజకవర్గంలో గతేడాది అక్టోబర్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర విజయవంతం కావడంతో పార్టీ స్థానిక నేతలు, కార్యకర్తల్లో ఉత్సాహం నింపింది. పక్కనున్న కర్ణాటక రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడంతో వారిలో మరింత జోష్ పెరిగింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే బరిలో నిలవాలనే లక్ష్యంతో ఆశావహులు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వాకిటి శ్రీహరి, అప్కాబ్ మాజీ చైర్మన్, దివంగత వీరారెడ్డి తనయుడు ప్రశాంత్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి నాగరాజుగౌడ్, ఎన్నారై పోలీస్ చంద్రశేఖర్ రెడ్డి, బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణరెడ్డి టికెట్ కోసం తమతమ గాడ్‌ఫాదర్ల ద్వారా ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది.

ఎవరికి వారు ధీమా..

ప్రశాంత్‌రెడ్డితండ్రి దివంగత వీరారెడ్డి గతంలో ఆత్మకూరు నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. తర్వాత అది దేవరకద్ర నియోజకవర్గంగా పునర్విభజనలో మారింది. కానీ ఆత్మకూరు, నర్వ, అమరచింత మండలాలు ప్రస్తుతం మక్తల్ నియోజకవర్గంలో ఉండడంతో పాటు రాహుల్ జోడోయాత్రలో కీలకంగా పనిచేయడం తనకు కలిసి వస్తుందనే అభిప్రాయంతో ప్రశాంత్‌రెడ్డి ఉన్నారు. బీసీ సామాజికవర్గానికి చెందిన నాగరాజుగౌడ్ గతంలో ఎన్ఎస్‌యూఐలో పనిచేశాడు. రేవంత్‌రెడ్డికి సన్నిహితంగా ఉంటున్న ఆయన రాహుల్‌గాంధీ జోడోయాత్రలో హుషారుగా పనిచేసి పార్టీ నేతల దృష్టిని ఆకర్షించారు. వీరితోపాటు డీసీసీ అధ్యక్షుడిగా పనిచేస్తున్న శ్రీహరి బీసీ కోటలో తనకు సీటు ఖాయమనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎన్నారై పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి కూడా సీటు కోసం గట్టిగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. నియోజకవర్గంలో కలియ తిరుగుతూ తన వర్గాన్ని పెంచుకుంటున్నారు. బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణరెడ్డి సైతం కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న వారిలో ఉన్నారు. మక్తల్ మండలం సంగంబండకు చెందిన ఆయన ప్రజలకు చేరువయ్యేలా తన ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజికసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పేదలకు విద్య, వైద్య పరమైన సాయంతో పాటు మహిళలకు కుట్టుమిషన్లను ఉచితంగా అందజేస్తున్నారు. పలు కాలనీల్లో తాగునీటి అవసరాలకు బోర్లు వేయించడం, పేదింటి యువతులకు సామూహిక వివాహాలు చేపడుతూ ముందుకు సాగుతున్నారు. ఐదుగురు నేతలు ఎవరికి వారు పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో కార్యకర్తల్లో గందరగోళం నెలకొనగా.. అధిష్టానానికి తలనొప్పిగా మారినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

ప్లాస్టిక్ నియంత్రణకు ప్రత్యేక బృందాలు



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్.. హాజరైన అధికారులు

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

వనపర్తి: పురపాలికలు, మండల కేంద్రాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ వెల్లడించారు. గురువారం సమీకృత కలెక్టరేట్‌లో జిల్లాలోని పుర కమిషనర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఇంజినీర్లతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. పురపాలికల వారీగా చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్లాస్టిక్ నియంత్రణకు ఇప్పటి వరకు తీసుకున్న చర్యల నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అదేవిధంగా హరితహారం, ఆస్తిపన్ను వసూలు, రహదారి విస్తరణ పనులు, పారిశుద్ధ్య చర్యలు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనాథ పిల్లల వివరాలు అందించాలని, బృహత్ పట్టణ ప్రకృతి వనాలు, పార్కుల ఏర్పాటుకు కృషి చేయాలని ఆదేశించారు. సేకరించిన తడి, పొడి చెత్తను వేరేచేసి సేంద్రియ ఎరువుగా తయారు చేసి విక్రయించాలని సూచించారు. సమీకృత మార్కెట్‌యార్డుల నిర్మాణాలు నెలరోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. దోబీ ఘాట్లు, వైకుంఠధామాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని, హరితహారం లక్ష్యం అధిగమించాలన్నారు.

రేపు 5కే రన్..

ఓటరు నమోదుపై అవగాహన కల్పించేందుకు శనివారం 5కె రన్ నిర్వహిస్తున్నామని.. అధికారులు, ప్రజాప్రతినిధులు, యువత అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ కోరారు. గురువారం కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఓటరు నమోదు, ఓటు ప్రాధాన్యతను ప్రజలకు స్పష్టంగా వివరించాలని సూచించారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల క్రీడా మైదానం వద్ద జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని.. సమీకృత కలెక్టరేట్ వరకు రన్ కొనసాగుతుందని తెలిపారు. ఔత్సాహికులు ఉదయం ఏడు గంటల వరకు చేరుకోవాలని, పీఈటీలు, కోచ్‌లు రన్‌లో పాల్గొనే వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రన్‌లో పాల్గొనే వారందరికీ టీ షర్టులు, విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎస్.తిరుపతిరావు, ఆర్డీఓ పద్మావతి, స్వీప్ నోడల్ అధికారి రమేష్‌రెడ్డి, డీఈఓ గోవిందరాజులు, పుర కమిషనర్ విక్రమసింహారెడ్డి పాల్గొన్నారు.

అధిష్టానానిదే తుది నిర్ణయం

- యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి



ఇంటింటికి యువజన కాంగ్రెస్ వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న శివసేనారెడ్డి

వనపర్తిటౌన్: పార్టీలో అంతర్గత విభేధాలు సహజమని.. వాటిని కుటుంబసభ్యుల్లా కూర్చొని చర్చించుకుంటామని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి స్పష్టం చేశారు. ఎవరికి టిక్కెట్ వచ్చినా అభ్యర్థి గెలుపునకు పని చేయాల్సిందేనని చెప్పారు. గురువారం జిల్లాకేంద్రంలోని తన నివాసంలో ఇంటింటికి యువజన కాంగ్రెస్ వాల్‌పోస్టర్లు విడుదల చేసి అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడే చిన్నారెడ్డికి టిక్కెట్ వచ్చిందని.. అదే ఆనవాయితీతో తనకు టిక్కెట్ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అధిష్టానానికి టిక్కెట్ ఎవరికి ఇవ్వాలో అవగాహన ఉందని.. ఏ నిర్ణయం తీసుకున్నా, ఎక్కడి నుంచి పోటీ చేయమంటే అక్కడి నుంచి నిలబడతానని తెలిపారు. ఇక్కడ జరిగే పరిణామాలు అది నాయకత్వానికి తెలుసని.. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా తన ఆమోదం లేకుండా చిన్నారెడ్డి వేసిన యూత్ కాంగ్రెస్ కమిటీలు రద్దు చేస్తామని, కొన్నింటిలో మార్పులు, చేర్పులుంటాయని స్పష్టం చేశారు. గడప గడపకు యువజన కాంగ్రెస్ పేరుతో నియోజకవర్గంలో పర్యటిస్తామని తెలిపారు. కాంగ్రెస్‌లో ఎన్ని గ్రూపులున్నా.. చివరికి రాహుల్‌గాంధీ గ్రూపునకే మనుగడ ఉంటుందని, గ్రూపు రాజకీయాలు లేనే లేవన్నారు. నిరుద్యోగ భృతి అంటూ అయిదేళ్లుగా యువతను మోసం చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం.. ఒక్కో నిరుద్యోగికి రూ.1.60 లక్షల భృతి ఇచ్చిన తర్వాతే ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో అవినీతి తంత్రానికి తెరలేపిందని.. 2023, డిసెంబర్‌లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. జిల్లా సోషల్ మీడియా చైర్మన్‌గా నందిమళ్ల చంద్రమౌళిను నియమిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శంకర్ ప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్, వాల్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

రామన్‌పాడులో పూర్తిస్థాయి నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో గురవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగుల నీటి నిల్వ ఉంది. జూరాల ఎడమ కాల్వ నుంచి 870 క్యూసెక్కులు, సమాంతర కాల్వ నుంచి 756 క్యూసెక్కుల వరద జలాశయానికి వచ్చి చేరుతుండగా.. ఎన్టీఆర్ కాల్వకు 950 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. భీమా ఫేస్–2 ద్వారా 636 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందినట్లు ఎస్ఐ పి. శ్రీనివాసులు తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జడ్చర్ల పట్టణంలోని నిమ్మబావి గడ్డకు చెందిన ముధావత్ లక్ష్మణ్(30) కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్‌పై పని నిమిత్తం మహబూబ్‌నగర్ వెళ్లి తిరిగి భూత్పూర్ మీదుగా జడ్చర్లకు వెళ్తున్నాడు. మార్గమధ్యంలో అమిస్తాపూర్ వద్ద గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొట్టి తలపై నుంచి వెళ్లడంతో లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. అమిస్తాపూర్ వాసుల సమాచారం మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. మృతుడి అన్న భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వలలో చిక్కుకుని వ్యక్తి మృతి

లింగాల: మండల కేంద్రానికి చెందిన మాకం సలేశ్వరం(46) చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. బుధవారం ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి మరుసటి రోజు వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. మండల కేంద్రానికి సమీపంలోని అప్పాయపల్లి వెళ్లే మార్గంలో ఉన్న ఓ బావి వద్ద దుస్తులు కనిపించడంతో సంఘటన వెలుగు చూసింది. బావిలో చేపల వేటకు వేసిన వలకు చుట్టుకుని చనిపోయినట్లు గుర్తించారు. మృతుడు మండల కేంద్రంలో హమాలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. మృతునికి భార్య కళమ్మ, ఇద్దర పిల్లలు ఉన్నారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

పెళ్లి కావడం లేదని యువకుడి బలవన్మరణం


నర్సింహారెడ్డి (ఫైల్)

తెలకపల్లి: పురుగు మందు తాగి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సంతోష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని పెద్దూరుకి చెందిన కోట్ల నర్సింహారెడ్డి(28) పెళ్లి కావడంలేదని తరచూ మనస్తాపానికి గురయ్యేవాడు. బుధవారం రాత్రి ఇంట్లోని పురుగు మందు తాగి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. తండ్రి భరత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

శాయిన్‌పల్లిలో మరొకరు..


బిజినేపల్లి: మండలంలోని శాయిన్‌పల్లి గ్రామానికి చెందిన తండాలో రాత్లావత్ పూరియా(51) ఇంట్లోనే పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాత్లావత్ పూరియా ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. కుటుంబసభ్యులు పొలం పనులు ముగించుకుని ఇంటికి వచ్చి చూసే సరికి చనిపోయి ఉన్నాడు. అతని ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతుడికి భార్య మఘ్రూ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రెండో రోజు బడికి తాళం వేసిన గ్రామస్తులు



రాజోళి: మండలంలోని తూర్పు గార్లపాడులో ప్రభుత్వ బడికి రెండవ రోజు కూడా తాళం వేశారు. 60 మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు ఉన్నాడని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బుధవారం బడికి తాళం వేసి నిరసన తెలిపినా అధికారులు స్పందించకపోవడంతో గురువారం కూడా పాఠశాలకు తాళం వేశారు. విద్యార్థులతో కలిసి పాఠశాల వద్దే నిరసన తెలిపారు. అధికారులు స్పందించకపోతే నిరసన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేస్తామని హెచ్చరించారు.

జోగుళాంబ ఆలయ ఎస్‌ఏ సస్పెండ్



జోగుళాంబ శక్తిపీఠం: రాష్ట్రంలోని ఏకైక శక్తి పీఠమైన అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయ సీనియర్ అసిస్టెంట్ రంగనాథ్‌ను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, పాలక మండలి చైర్మన్ చిన్నకృష్ణయ్య గురువారం తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తుల దగ్గర పూజల పేరిట డబ్బులు వసూలు చేసి వాటికి సరైన రశీదులు ఇవ్వకపోవడం, అలాగే ఆలయంలో ఆన్ డ్యూటీలో ఉంటూనే దేవస్థానం చైర్మన్ కార్యాలయంలో అన్యమతస్తుడిని పిలిపించుకుని సమావేశాలు నిర్వహించడం, ఆలయానికి వచ్చే ఓ భక్త కుటుంబీకుల కూతురును అన్యమతస్తుడితో వివాహం జరిపించే ప్రయత్నం చేయడం వంటి తదితర ఆరోపణలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీనియర్ అసిస్టెంట్ రంగనాథ్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశామన్నారు.

పంచలోహ విగ్రహాల దొంగ అరెస్టు

- చోరీకి గురైన విగ్రహాలను రికవరీ
- వివరాలు వెల్లడించిన వన్‌టౌన్ సీఐ సైదులు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సైదులు

మహబూబ్‌నగర్ క్రైం: పంచలోహ విగ్రహాలను దొంగతనం చేసిన వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ సైదులు ఈ కేసు వివరాలు వెల్లడించారు. హనుమాన్‌పురలో ఉన్న పవనపుత్ర వీరాంజనేయస్వామి దేవాలయంలో ఈనెల 14న తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించారు. ఆలయం ముఖద్వారానికి వేసిన తలుపు తాళం బ్రేక్ చేసి లోపలికి ప్రవేశించి బంగారం పూత, వెండి, ఇత్తడితో తయారు చేసిన దాదాపు 30 కేజీల రాముడు, సీత, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి రెండు జతల పంచలోహ విగ్రహాలను ఎత్తుకెళ్లారని తెలిపారు. దీనిపై ఆలయ నిర్వాహకుడు వడ్డె హన్మంతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు చెప్పారు. పాత ఆర్టీఏ కార్యాలయం దగ్గర చేస్తున్న వాహనాల తనిఖీల్లో హనుమాన్‌పురకు చెందిన ఎండీ రషీద్ అలియాస్ నసీర్ ఓ మూటతో అనుమానాస్పదంగా కనిపిస్తే అదుపులోకి విచారణ చేయగా ఆ విగ్రహాలు ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ చేయబడిన విగ్రహాలుగా గుర్తించినట్లు సీఐ తెలిపారు. చోరీకి గురైన అన్ని విగ్రహాలను రికవరీ చేశామన్నారు. దొంగతనం చేసిన ఎండీ రషీద్ గతంలో అదే ఏరియాలో బంగారం దొంగతనం కేసులో జైలుకు వెళ్లి వారం రోజుల కిందట విడుదల అయినట్లు సీఐ తెలిపారు. ఇతడిపై గతంలో రెండు కేసులు ఉన్నాయన్నారు. టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగించే ఎండీ రషీద్ ఈజీ మనీకి అలవాటు పడి దొంగతనాలు చేయడం మొదలుపెట్టినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ సుధా మాధురి పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడాలి


డీఐజీ ఎల్ఎస్ చౌహాన్‌కు మొక్కను అందజేస్తున్న ఎస్పీ మనోహర్

నాగర్‌కర్నూల్ క్రైం: శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ సిబ్బంది నిరంతరం కృషిచేయాలని జోగుళాంబ గద్వాల జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎస్పీ కార్యాలయాన్ని గురువారం ఉదయం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మనోహర్ డీఐజీకి మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఎస్పీ కార్యాలయంలోని అన్ని విభాగాలను పరిశీలించడంతోపాటు పలు సూచనలు చేశారు. జిల్లాలోని డీఎస్పీ, సీఐ, ఎస్ఐ, కార్యాలయాలకు సంబంధించి అన్ని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో నేరాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా నేరాలు జరిగితే వెంటనే నేరస్తులను గుర్తించి శిక్షపడేలా చూడాలన్నారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితులకు సత్వరమే న్యాయం జరిగేలా పోలీస్ సిబ్బంది కృషిచేయాలని, శాంతి భద్రతల పరిరక్షణలో రాష్ట్రంలో నాగర్‌కర్నూల్ జిల్లా ముందుండేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ రామేశ్వర్, ఏఆర్ ఎస్పీ భరత్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న యాగమహోత్సవం



జడ్చర్ల టౌన్: పట్టణంలోని శ్రీకృష్ణపీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానంద ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విశ్వశాంతి యాగ మహోత్సవం అయుత చండీ అతిరుద్రం నాల్గవ రోజు గురువారం కొనసాగింది. నిత్యపూజలతోపాటు లక్ష్మి, కుబేర, అష్టలక్ష్మి, ధాన్యలక్ష్మి హోమాలు నిర్వహించారు. సాయంత్రం ఉమామహేశ్వర స్వామి కల్యాణం జరిపించారు. యాగ మహోత్సవాన్ని మాజీ ఎంపి జితేందర్‌రెడ్డి, మాజీ మంత్రి డీకే అరుణ సందర్శించారు. యాగశాలలో ప్రత్యేక పూజలు చేసి వేదపండితుల ఆశీర్వచనాలు పొందారు. ఉత్సవంలో భాగంగా శుక్రవారం విశేష చండీసహిత గజలక్ష్మి హోమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం లక్ష కుంకుమార్చన, లక్ష గాజులార్చనలు చేయనున్నారు.

మహిళ దారుణ హత్య

- ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం
- క్లూస్ టీంతో ఆధారాలు సేకరించిన పోలీసులు
- నాలుగు బృందాలతో నిందితుడి కోసం గాలింపు

మీర్‌పేట: మహిళను దారుణంగా హతమార్చి, ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించిన సంఘటన మీర్‌పేట పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం ఇంద్రకల్లుకు చెందిన బొజ్జమ్మ (55) మీర్‌పేట బాలాపూర్ చౌరస్తా సమీపంలోని ఇండో అమెరికన్ స్కూల్‌లో వాచ్ ఉమెన్‌గా పని చేసేది. ఏడాది క్రితమే ఈ పాఠశాల మూతపడగా.. స్కూల్ ఆవరణలోని ఓ గదిలో ఒంటరిగా నివాసముంటోంది. ఈమె భర్త లింగమయ్య అప్పుడప్పుడు వచ్చి వెళ్తుండేవాడు. ఇదిలా ఉండగా బొజ్జమ్మ చెల్లెలి కొడుకు ఆంజనేయులు సైతం తరచూ వచ్చి యోగక్షేమాలు తెలుసుకునేవాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం 11 గంటలకు బొజ్జమ్మ వద్దకు వచ్చిన ఆంజనేయులు తిరిగి 11.30కు వెళ్లిపోయాడు. అనంతరం ఇంట్లో నుంచి పొగలు రావడాన్ని స్థానికులు గమనించారు. అక్కడకు వెళ్లి చూడగా.. రక్తగాయాలైన బొజమ్మ అచేతనంగా పడి ఉండటం, ఒంటిపై కాల్చిన దుప్పటి కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ, వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బొజ్జమ్మ వద్ద ఉన్న వెండి కడియాలు, పట్టీలు, బంగారు ముక్కుపుడక కోసమే.. ఆంజనేయులు ఆమెతో గొడవ పడి ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. మృతురాలి ముఖానికి దుస్తులు చుట్టి సుత్తెతో దాడి చేసి, చనిపోయిందని నిర్ధారించుకున్న తర్వాత దుప్పటికి నిప్పంటించి ఆమెపై వేసి పారిపోయినట్లు భావిస్తున్నారు. ఉదయం వచ్చిన సమయంలో మాస్కు ధరించిన అతను తిరిగి వెళ్లే సమయంలో దుస్తులు మార్చుకున్నట్లు సీసీ కెమెరాల్లో రికార్డయిందని పోలీసులు చెప్పారు. బొజ్జమ్మను హత్య చేసిన తర్వాత 'నా చావుకు నా భర్తే కారణం' అని రాసిన ఆంజనేయులు బొజ్జమ్మే స్వయంగా ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు చిత్రీకరించేందుకు ప్రయత్నించాడని పేర్కొన్నారు. మృతురాలి కాలు పాక్షికంగా కాలిపోయిందని తెలిపారు. బొజ్జమ్మకు పిల్లలు లేరని, కేసు నమోదు చేసుకుని బాడీని పోస్టుమార్టం కోసం నిమిత్త ఉస్మానియా ఆస్పత్రికి తరలించామని వెల్లడించారు. ఆంజనేయులు 15 ఏళ్ల క్రితమే భార్యను వదిలేశాడని, ఇతన్ని పట్టుకునేందుకు నాలుగు బృందాలతో గాలిస్తున్నామని స్పష్టంచేశారు.

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు



పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని పీజేపీ క్యాంప్ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో అంతర్ జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీలు రెండో రోజు గురువారం హోరాహోరిగా సాగాయి. నల్గొండ జట్టుపై వనపర్తి జట్టు 3–0తో, నిజామాబాద్ జట్టుపై రంగారెడ్డి జట్టు 3–0తో, అదిలాబాద్ జిల్లా జట్టుపై ఖమ్మం జట్టు 4–0తో గెలుపొందింది. మహబూబ్‌నగర్ జిల్లా జట్టుపై కరీంనగర్ జిల్లా జట్టు 2–1తో గెలిచింది. అదిలాబాద్ జిల్లా జట్టుపై నల్గొండ జిల్లా 2–0తో గెలిచింది. మధ్యాహ్నం కొనసాగిన మ్యాచ్‌లో రంగారెడ్డి, మెదక్ జిల్లాల మధ్య కొనసాగిన మ్యాచ్ డ్రా గా ముగిసింది. నిజామాబాద్, మహబూబ్‌నగర్ జట్ల మధ్య మ్యాచ్, వనపర్తి, ఖమ్మం జట్ల మధ్య మ్యాచ్ డ్రా గా ముగిసింది. వనపర్తి, ఖమ్మం, రంగారెడ్డి, మెదక్ జిల్లాల సెమీఫైనల్ మ్యాచ్ శుక్రవారం కొనసాగనుందని నిర్వాహకులు తెలియజేశారు.

భర్తను గడ్డపారతో పొడిచిన భార్య

- చికిత్స పొందుతూ మృతి
- ఆత్మకూర్ మండలం రేచింతలలో ఘటన


చెన్నరాయుడు (ఫైల్)

ఆత్మకూర్: తాగొచ్చి వేధిస్తున్నాడనే కోపంతో అర్ధరాత్రి నిద్రిస్తున్న భర్తను భార్య గడ్డపారతో పొడిచింది. దీంతో చికిత్స పొందుతూ భర్త మృతిచెందిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. వనపర్తి జిల్లా ఆత్మకూర్ మండలం రేచింతలలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. గ్రామానికి చెందిన బోరెల్లి చెన్నరాయుడు(40)కు భార్య మణెమ్మ, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వీరి కుటుంబంలో మద్యం చిచ్చురేపింది. కొంతకాలంగా తాగుడుకు బానిసగా మారిన చెన్నరాయుడు అప్పులు చేస్తూ నిత్యం తాగి వచ్చి భార్యతో గొడవ పడేవాడు. దీంతో వేధింపులు భరించలేని మణెమ్మ ఈ నెల 11న రాత్రి ఒంటిగంట సమయంలో నిద్రిస్తున్న భర్తను గడ్డపారతో పొడిచింది. ఒక్కసారిగా తేరుకున్న చెన్నరాయుడు కేకలు వేస్తూ బయటకు పరుగులు తీస్తూ కుప్పకూలిపోయాడు. గమనించిన చుట్టపక్కల వారు వెంటనే ప్రైవేట్ వాహనంలో పెబ్బేరు ఆస్పత్రికి, అక్కడి నుంచి వనపర్తికి, కర్నూలు ఆస్పత్రులకు తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా.. పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. ఈ విషయమై చెన్నరాయుడు తల్లి కుర్మమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు.

నవోదయ విద్యార్థుల జాబితా విడుదల

బిజినేపల్లి: వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో 11వ తరగతిలో ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థుల జాబితాను విద్యాలయ ప్రిన్సిపల్ భాస్కర్‌కుమార్ గురువారం విడుదల చేశారు. ఈ జాబితాలో 154478 మహమ్మద్ అబ్దుల్ రెహమాన్, 154503 రామునాయక్, 154616 భానుప్రకాష్, 154775 గాయత్రి, 154871 పామాపురం శ్రావణి, 153991 కీర్తన, 154087 యశ్వంత్‌సాగర్, 154353 ఎండీ నవాజ్, 154357 జ్యోత్స్న, 154804 శారదావంశీ, 154305 మాల శివాని, 154519 కల్పన, 154585 వైష్ణవి, 154673 ఇస్నాతి తేజస్విని, 154693 సిద్దార్థలు ఎంపికయ్యారని తెలిపారు. వీరు ఆగస్టు 21వ తేదీ సంబంధిత ప్రవేశ పత్రం, పదో తరగతి మార్కుల జాబితా, కుల, ప్రాంత, ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్‌కార్డు, రెసిడెన్సీ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

నడిరోడ్డుపై కూరుకుపోయిన లారీ

- జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం



జాతీయ రహదారిపై కూరుకుపోయిన లారీ


జడ్చర్ల: పట్టణంలోని 167వ నంబర్ జాతీయ రహదారి మధ్యలో ఇటుకల లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ గురువారం తెల్లవారుజామున కూరుకుపోయింది. దీంతో రోడ్డుపై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సిగ్నల్‌గడ్డకు అటు ఇటుగా జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కల్వర్టు దగ్గర పనులు జరుగుతున్నాయి. అయితే కల్వర్టు దగ్గర రోడ్డుపై ఏర్పడిన గోతిలో లారీ కూరుకుపోయింది. బయటకు లాగే ప్రయత్నం చేసినా ఫలించలేదు. దాదాపు 10 గంటల పాటు లారీ ఇలాగే రోడ్డుపై ఉండిపోవడంతో ఈ దారి గుండా రాకపోకలు సాగించే వాహనాలను గౌరీశంకర్ కాలనీ మీదుగా దారి మళ్లించారు. కొద్దిసేపటి తర్వాత రోడ్డుకు ఓ పక్కగా చదును చేయడంతో రాకపోకలు కొనసాగాయి. చివరికి లారీలో ఉన్న ఇటుకలను ట్రాక్టర్‌లోకి అన్‌లోడ్ చేసి లారీని ఖాళీ చేసి బయటకు తీశారు. అయితే జాతీయ రహదారి విస్తరణ పనులపై అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ అలసత్వం వహిస్తున్నారు. నెలల తరబడి పనులు సాగుతుండగా.. మరోదిక్కు నాణ్యత సైతం కొరవడింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారని, ఇప్పటికైనా పనుల్లో వేగాన్ని పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పాలమూరు లక్ష్యం 262, ప్రస్తుతం 72/3

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో హెచ్‌సీఏ టుడే లీగ్ చాంపియన్‌షిప్‌లో గురువారం మహబూబ్‌నగర్ జిల్లా నల్లగొండ జట్టుతో తలపడింది. తొలుత బ్యాటింగ్ చేసిన నల్లగొండ 75 ఓవర్లలో 261 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జిల్లా బౌలర్లు శ్రీకాంత్, సాయికుమార్ యాదవ్ నాలుగేసి వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన జిల్లా జట్టు తొలి రోజు ఆట ముగిసేసరికి 24 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 72 పరుగులు చేసింది. అబ్దుల్ రాఫే (23), ఈ.కాశీం(17)లు క్రీజులో ఉన్నారు. పాలమూరు గెలిచేందుకు శుక్రవారం రెండో రోజు 190 పరుగులు చేయాల్సి ఉంది.

తల్లీకుమారుడు అదృశ్యం


అరుణ


చరణ్

గోపాల్‌పేట: తల్లీకుమారుడు అదృశ్యమైన ఘటన రేవల్లి మండలంలోని చెన్నారంలో చోటుచేసుకుంది. రేవల్లి మండల ఏఎస్ఐ మల్లయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నారానికి చెందిన గౌరవోని అరుణ, గౌరవోని మహేష్ భార్యాభర్తలు. వీరు వ్యవసాయం చేసుకుంటూ జీవనం చేసుకుంటున్నారు. వీరికి ఐదేళ్ల బాలుడు ఉన్నాడు. అయితే ఈ నెల 15న భర్త బయటికి వెళ్లిన తర్వాత కుమారుడిని తీసుకుని ఆస్పత్రికి వెళ్తున్నామని ఇంటిపక్కల వారికి చెప్పి బయటికి వెళ్లింది. ఆ రోజు నుంచి ఇంటికి తిరిగి రాలేదు. చుట్టాలు, తెలిసిన వారి ఇళ్ల వద్ద వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో భర్త గురువారం రేవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

మధ్యాహ్న భోజనానికి ఎగనామం

- నీళ్లు లేవని 15 రోజులుగా వంటచేయని నిర్వాహకులు
- పట్టించుకోని ఉపాధ్యాయులు, ఉన్నతాధికారులు


మధ్యాహ్నం ఇళ్లకు వెళ్లిపోతున్న విద్యార్థులు

గండేడ్: వంట చేయడానికి నీళ్లు లేవని నిర్వాహకులు చేతులెత్తేశారు. నెలరోజులుగా బోరు కాలిపోయినా మరమ్మతు చేయకపోవడంతో విద్యార్థులు ఆకలితో అలమటిస్తూ ఇళ్లకు వెళ్తున్నారు. మండలంలోని వెన్నాచేడ్ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఉండగా.. సుమారు 170 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. నారాయణపేట జిల్లా కోస్గి మండలం మల్‌రెడ్డిపల్లి, సారంగరావుపల్లి, గండేడ్ మండలం గోవింద్‌పల్లి, జానంపల్లి, గోవింద్‌పల్లి తండాలతోపాటు వెన్నాచేడ్‌కు విద్యార్థులు ఇక్కడే చదువుతున్నారు. అయితే పాఠశాలలు ప్రారంభమైన మొదట్లో కొన్ని రోజులు బోరు మోటారు నడిచినా తర్వాత అది కాలిపోవడంతో మరమ్మతు చేయించి తిరిగి బిగించారు. కానీ, ఒక్కరోజే నడిచిన మోటారు తిరిగి కాలిపోవడంతో పదిహేను రోజులుగా మరమ్మతు చేయించడం లేదు. దీంతో వంట చేయడానికి నీళ్లు లేవని, ఫిల్టర్ నీళ్లు కొనుగోలు చేసి వంట చేయలేమని చెప్పి భోజనం వండటం లేదు. దీంతో ప్రతిరోజు విద్యార్థులు కొందరు ఇళ్ల నుంచి భోజనాలు తెచ్చుకుంటుండగా మరికొందరు అర్ధాకలితో అలమటిస్తున్నారు. కొంతమంది విద్యార్థులు మధ్యాహ్నమే ఇళ్లకు వెళ్లిపోతున్నారు. ఈ విషయమై పాఠశాల హెచ్ఎంను 'సాక్షి' వివరణ కోరగా పాత మోటారు పనిచేయడం లేదని చెప్పడంతో కొత్త మోటారు కొనుగోలు చేశామని, పది రోజులుగా మోటారు బిగించడానికి మెకానిక్‌లు రావడం లేదన్నారు. ఈ విషయాన్ని ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే మోటారు బిగించి సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

హాకీ ఎంపికలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, రాష్ట్ర పరిశీలకుడు మక్బూల్ అహ్మద్

- రాష్ట్ర వ్యాప్తంగా 72 మంది హాజరు

వనపర్తిటౌన్: వనపర్తి హాకీ అకాడమీలో ఖాళీగా ఉన్న 13 సీట్లకు ఎంపిక ప్రక్రియను గురువారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ ఎంపికల్లో తొలి రోజు ఫిజికల్ ఫిట్‌నెస్ పోటీలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 72 మంది క్రీడాకారులు హాజరుకాగా, రాష్ట్ర పరిశీలకుడు మక్బూల్ అహ్మద్ పర్యవేక్షించారు. శుక్రవారం క్రీడాకారులకు నైపుణ్యాలపై పోటీలు నిర్వహించి, అర్హులను ఎంపిక చేయనున్నట్లు డీవైఎస్ఓ సుధీర్ కుమార్‌రెడ్డి తెలిపారు.

ప్రతిభ కనబర్చాలి...

క్రీడాకారులు ప్రతిభకనబర్చి భవిష్యత్‌లో అవకాశాలను అందిపుచ్చుకోవాలని మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, హాకీ అకాడమీ రాష్ట్ర పరిశీలకుడు అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.. వనపర్తి హాకీకి పెట్టింది పేరని, ఈ ప్రాంతంలో శిక్షణ పొందడం క్రీడాకారులకు అన్ని విధాలుగా కలిసి వస్తుందన్నారు. క్రీడల్లో భాగంగా సమయస్ఫూర్తిని, మెళకువలతో పోటీల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో పీడీలు సురేందర్‌రెడ్డి, కుమార్, కోచ్‌లు జావిద్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

లారీని వెనక ఢీకొన్న కారు

- ఒకరి పరిస్థితి విషమం.. మరో నలుగురికి గాయాలు
- ఆస్పత్రి నుంచి ఇంటికి తిరిగొస్తుండగా ఘటన


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

అడ్డాకుల: పక్షవాతానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందిన వ్యక్తిని కారులో ఇంటికి తీసుకొస్తుండగా.. ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన ఆపిన లారీని వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండగా.. మరో నలుగురు గాయాలతో బయటపడ్డారు. మండలంలోని శాఖాపూర్ శివారులో జాతీయ రహదారిపై చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ మాధవరెడ్డి కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని జటప్రోల్‌కు చెందిన మజహర్ ఇటీవల పక్షవాతానికి గురవడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స చేయించారు. బుధవారం రాత్రి మజహర్‌ను డిశ్చార్జ్ చేయడంతో భార్య, కుమారుడు, ఇద్దరు బామ్మర్దులతో కలిసి కారులో పెబ్బేరు మీదుగా ఇంటికి బయలుదేరారు. గురువారం తెల్లవారుజామున 3 గంటలకు శాఖాపూర్ దాటిన తర్వాత హర్యానా మార్వాడి దాబా వద్ద రోడ్డు పక్కన నిలిపిన ట్రెయిలర్ లారీ వెనక కారు ఢీకొట్టుకుంది. దీంతో కారులో డ్రైవర్ సీటు పక్కన కూర్చున్న మజహర్ బామ్మర్ది మహిమూద్ తలకు తీవ్రగాయాలవగా.. కారు నడుపుతున్న మరో బామ్మర్ది మైనొద్దీన్, వెనక సీట్లో ఉన్న మజహర్, ఆయన భార్య సాధిక, కుమారుడు ఇమ్రాన్‌లకు గాయాలయ్యాయి. అందరినీ ఎల్అండ్‌టీ అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి, మహమూద్ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. మహమూద్, మైనొద్దీన్ ఇద్దరు అన్నదమ్ములు కాగా.. వారి స్వస్థలం ఎల్లూరు. తమ సొంత బావను ఆస్పత్రి నుంచి ఇంటికి తీసుకెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి బలవన్మరణం

- మృతుడు జూలపల్లి పెద్దతండా వాసిగా గుర్తింపు


అనిల్ (ఫైల్)

హన్వాడ/ మహమ్మదాబాద్: సవతి తల్లిని అత్యంత దారుణంగా హతమార్చిన ఓ యువకుడు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం.. మహమ్మదాబాద్ మండలం జూలపల్లి పెద్దతండాకు చెందిన లోక్యానాయక్ రెండో కుమారుడు అనిల్(24) హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. అయితే బతుకుదెరువు కోసం పుణెకు వెళ్లిన లోక్యానాయక్ తన రెండో భార్య లక్ష్మితో కలిసి 15 రోజుల క్రితం సొంత తండాకు రాగా.. ఈ నెల 8న అనిల్ సైతం వచ్చాడు. ఈ క్రమంలో తండ్రి మహబూబ్‌నగర్ పనిమీద వెళ్లడంతో ఇదే సమయంలో అనిల్ పొలం దగ్గరకు వెళ్లి చిన్నమ్మ లక్ష్మి(32)ను బండరాయితో తలపై మోది హతమార్చాడు. అనంతరం ఒంటి మీద దుస్తులు వదిలేసి అడవిలోకి పారిపోయాడు. దీంతో మహమ్మదాబాద్ పోలీసులు అటవీ ప్రాంతంలో డ్రోన్ కెమెరాతో రెండురోజులు గాలింపు చేపట్టినా కనిపించలేదు. అయితే గురువారం షేక్‌పల్లి పశువుల కాపర్లు కుళ్లిన స్థితిలో ఉరివేసుకుని ఉన్న మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెళ్లి అనిల్‌గా గుర్తించారు. తల్లిని చంపిన రెండు, మూడురోజులకే అవమాన భారంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు పేర్కొన్నారు. కాగా అనిల్ మృతితోపాటు లక్ష్మిని హత్య చేయడానికి గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెప్పారు.

గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం

మహమ్మదాబాద్: గడ్డి మందు తాగి ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గండేడ్ మండల పరిధిలోని కొండాపూర్‌కు చెందిన చెంచు పావని తన ఇంట్లో మధ్యాహ్నం గడ్డి మందు తాగింది. విషయాన్ని పొలం వద్ద ఉన్న భర్త వెంకటయ్యకు ఫోన్ ద్వారా సమాచారం అందించింది. వెంటనే ఇంటికి చేరుకున్న భర్త 108కు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది ఈఎంటీ సాయికుమార్, పైలెట్ అక్బర్ ఆమెకు ప్రథమ చికిత్స చేసి అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.